

## సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని బుధవారం అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పంచాయతీ పరిదిలోని ప్రజలకు సచివాలయం ఏంత గానో దోహద పడు తుందన్నారు. దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రేగం మత్స్యలిగం, ఎంపీపీ కూడా రాజుబాబు, సర్పంచ్ బొంజుబాబు, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము, జెఇ సంజీవ్, వైస్సార్సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# సహకార రంగం బలోపేతానికి చర్యలు

### సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు



మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ శివశ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు : సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సంయుక్త కలెక్టర్ జె. శివ శ్రీనివాసు పేర్కొన్నారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలక్టరేట్లో వ్యవసాయ, ఉద్యాన వన, మత్స్య, పశు సంవర్ధక శాఖ అధికారులకు, క్షేత్ర స్థాయి సచివాలయం సిబ్బందికి నిర్వహించిన ఒక రోజు వర్కుషాపుకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార చట్టం 1964లో ఏర్పాటు చేసారన్నారు. ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాలు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సొసైటీలలో అనుబంధంగా ఉన్న రైతులను సంప్రదించి, వ్యవసాయ పెట్టుబడులు ఏ విధంగా సమకూర్చు కుంటున్నారో తెలుసుకోవాలన్నారు. గిరిజన రైతులను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో సభ్యులుగా చేర్చాలని సూచించారు. రైతులకు పంట నష్టం లేకుండా సొసైటీల ద్వారా పంట కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. సొసైటీలకు పెట్రోలు బంకు ఏర్పాటు, రేషన్ డిపోలు నిర్వహణకు అనుమతులు ఇస్తామని చెప్పారు.

జిల్లా సహకార అధికారి ఎం.వి. రామకృష్ణరాజు మాట్లాడుతూ, రైతులకు పరపతి సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు అందిస్తామన్నారు. ఎరువులు వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.ఆర్.రాకేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయా ధికారులు, వ్యవసాయ, ఉద్యాన వన అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండలంలోని మారుమూల ఇరగాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు విధులకు హాజరు కాలేదని గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయుడు పై చర్యలు తీసుకోవాలని బుధవారం తల్లితండ్రులు, విద్యార్థులు పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుడే డుమ్మా కొడుతుంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు. స్పందనలో ఫిర్యాదు అనంతరం ఉపాధ్యాయుడుపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఉపాధ్యయుడుపై చర్యలు తీసుకొని వేరొకరిని నియమించాలని డిమాండ్ చేశారు.




ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లితండ్రులు

## ఉప్పొంగుతున్న గెడ్డలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో రెండు రోజులుగా ఏడతెరిపి లేకుండా వానలు కురవడంతో కుమ్మడ గ్రామ సమీపంలో బ్రిడ్జి నుంచి నీరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి కుమడ పంచాయతీ కేంద్రం సమీపంలో కల్వర్టు పైనుంచి వరద నీరు అధికంగా చేరడంతో కుమడ, బూసిపుట్టు పంచాయతీల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఈ సమస్యపై అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

## తప్పిన ముప్పు

### ఒరిగిన భారీ విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-పాడేరు:పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కు వెళ్లే మెయిన్ రోడ్డులో విద్యుత్తు మెయిన్ లైన్‌లోని భారీ విద్యుత్ స్తంభం బుధవారం ఉదయం నేల కొరిగింది. రోడ్డుకు కొంచెం ఎత్తు వరకు ఉండి పోవడంతో ముప్పు తప్పింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఈ రోడ్లో విద్యుత్ స్తంభం కూలిన సంగతి తెలిసిన వెంటనే ఎలక్ట్రికల్ సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపివేశారు. అనంతరం ట్రాఫిక్ మళ్లించి నేలకు ఒరిగిన భారీ విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం

## వర్షంతో హైవే రోడ్డు బురదమయం

### కొత్తవలసలో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:గత మూడు రోజుల నుంచి మండలంలో ఏడతెరిపి లేకుండా జోరుగా వర్షం కురుస్తుంది. మంగళవారం రాత్రి భారీగా వర్షం కురవడంతో బల్లుగూడ సమీపంలోని కొత్తవలసలో నూతనంగా నిర్మిస్తున్న 516 ఈ హైవే రోడ్డులో మట్టి వేసి వదిలేయడంతో పూర్తిగా బురద మయంగా మారింది. ఈ రోడ్డు గుండా వచ్చే వాహనాలు బురదలో కూరుకు పోవడంతో వాహనాల రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనాలు నిలిచిపోయాయి. అరుకు, పాడేరు వైపు నుంచి వచ్చిన వాహనాలు ఎటు వెళ్లలేక నిలిచి పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం స్పందించి హైవే రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



నిలిచిన వాహనాలు




బురదలో వెళుతున్న బస్


## మంచు దుప్పట్లో మన్యం

### ఘాట్ రోడ్‌లో వాహనదారుల ఇక్కట్లు



అనంతగిరి, ములియగుడలో కమ్మేసిన పొగ మంచు

ప్రజాశక్తి- అనంతగిరి: ఏజెన్సీ ప్రముఖ పర్యాటక కేంద్రం అనంతగిరి, ఘట్ రోడ్డులో బుధవారం పొగ మంచు కమ్మేసింది. మండలంలోని గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు, మరో పక్క దట్టమైన పొగ మంచు కురుస్తోంది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వర్షం కురిసిన అనంతరం సాయంత్రం వేళలో పొగ మంచు కురుస్తుండటంతో అనంతగిరి, అరకు. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు పలుచోట్ల వాహనాలను నిలిపివేస్తున్నారు. కొందరైతే వాహనాల లైట్లు వెలిగించి ప్రయాణం చేస్తున్నారు. చిలకలగెడ్డ మొదలుకొని ఘాట్ రోడ్, టైడా, డమ్ముకు, అనంతగిరి, బీసుపురం, అరకు మండలం సుంకరమెట్ట, బల్లుగుడ వరకు మలుపులతో ఘాట్ రోడ్ ఉంది.



లైట్ల వెలుగులో వెళుతున్న వామనం

## 26న పెదబయలు మండల సమావేశం

ప్రజాశక్తి- పెదబయలు : మండల పరిషత్ సర్వ సభ సమావేశం ఈనెల 26న ఉదయం పది గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎల్.పూర్ణయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటనలో ఎంపిడిఒ పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు. అధికారులు సమావేశానికి వచ్చే టప్పుడు తగు సమాచారంతో హాజరు కావాలని ఎంపిడిఒ పూర్ణయ్య కోరారు.

# పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి

- ★ బుధవారం సాయంత్రానికి 32 అడుగులకు చేరిన నీటి మట్టం
- ★ శబరి నదిలోనూ పెరిగిన ప్రవాహం
- ★ వణుకుతున్న ముంపు గ్రామాల ప్రజలు



ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ప్రజాశక్తి-చింతూరు, ఎటపాక

ఎగువన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న గోదావరి, శబరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతోంది. గోదావరికి ఎగువనున్న కాళేశ్వరం, ఇంద్రావతి, తాలిపేరు నదుల నుండి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం మధ్యాహ్నానికి 30.07 అడుగులు చేరికోగా, సాయంత్రానికి 32 అడుగులకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి 35 అడుగులకు చేరే అవకాశం ఉన్నదని భద్రాద్రి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 25 అడుగులకు చేరింది. పేరూరు వద్ద 5.30 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తుంది. చింతూరు మండలంలోని సోకులేరు, చంద్రవంక వాగుల్లో వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. సోకులేరు వాగు ఇరువైపులా నీరు చేరి మరికొద్ది గంటల్లో రోడ్డు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున చింతూరు, విఆర్.పురం మండలాల రహదారులు స్తంభించే అవకాశం ఉంది. చంద్రవంక వాగు రెండు రోజుల నుంచి పొంగి ప్రవహిస్తోంది.

**భయాందోళనలో ముంపు ప్రాంతల ప్రజలు**

గోదావరిలో వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో ముంపు గ్రామాల ప్రజలు భయంతో వణికి పోతున్నారు. గతేడాది జూలై నెల రెండో వారంలో ప్రమాద స్థాయిలో వరద నీరు చేరి గ్రామాలు నీట మునిగాయి. ప్రభుత్వం ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లా పాపాలతో కొండల్లోనూ, గుట్టల్లోనూ తలదాచుకున్నారు. కారుచీకటిలో నానా అవస్థలు పడ్డారు. గతంలో వర్షం వస్తే పంటలు సాగు చేసుకోడానికి సన్నద్ధమయ్యే రైతులు, నేడు వర్షం వస్తుందంటే వరద భయంతో భయాందోళన చెందుతున్నారు. మళ్లీ అటువంటి పరిస్థితి పునరావృతం అవుతందని ప్రజలు వణికిపోతున్నారు.



వదర పరిస్థితులను తెలుసుకుంటున్న చింతూరు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే

**ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు**

వరద ప్రవాహం పెరిగి ప్రమాద స్థాయికి చేరే అవకాశం ఉన్నందున ఇప్పటికే ముంపు మండలాల పర్యవేక్షణకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చింతూరు డివిజన్ కేంద్రానికి చేరుకున్నారు. వరదల్లో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు ముంపు ప్రాంతంలో ఉన్న ప్రజానీకానికి సమాచారం ఇస్తూ అప్రమత్తం చేయాలని కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ప్రభుత్వ అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎగువ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 2022లో వరద బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా ముంపు ప్రాంతాల్లో పడవలను, ఎన్‌డిఆర్ఎఫ్ వంటి రక్షణ బలగాలను ఏర్పాటు చేసేందుకు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. నిత్యావసర సరుకులు, ఆహార నిల్వలను బఫర్ స్టాక్ సెంటర్లకు తరలించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వరద సమాచారాన్ని చేరవేసి అప్రమత్తం చేసే ప్రక్రియ చేపట్టారు. బుధవారం చింతూరు ఎంపీడీవో వెంకటరత్నం, తహశీల్దారు కారం సుబ్బారావు, ఐటిడిఎ సిబ్బంది వరద సహాయక చర్యలు చేపట్టారు.



పునరావాస కేంద్రం వద్ద ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్న అధికారులు

**లాంచీలు సిద్ధం**

**విఆర్.పురం :** గోదావరి, శబరి నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్లడ్ లాంచీలు ఏర్పాటు చేశారు. గోదావరి, శబరి నదులను అనుకున్న ఉన్న గ్రామ పంచాయితీ కార్యదర్శులు, గ్రామ వాలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు ఎన్.శ్రీధర్ ఆదేశించారు. ముంపు ఏర్పడితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో మైక్ ద్వారా ప్రచారం చేయాలని వాలంటీర్లను ఆదేశించారు. బఫర్ స్టాక్‌ను వెంటనే పంపిణీ చేయాలని డీలర్లను కోరారు. మండలంలో వరద పరిస్థితులను తెలుసుకుంటున్న చింతూరు ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే మండలంలో పర్యటించారు.

**సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్న ప్రజలు**

**కూనవరం :** గోదావరి పోటెత్తున్న మాట వినగానే ముంపు ప్రాంత ప్రజల్లో భయం గుబులు పట్టుకుంది. గోదావరి నీటి మట్టం పెరిగిందని తెలియడంతో బుధవారం కూనవరంలో ప్రజలు తమ సామాగ్రి వాహనాల్లో ఎగువ ప్రాంతాలకు తరలించే పనిలో బిజీగా ఉన్నారు. వాహనాల్లో ఎగువ ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.



సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సామాన్లు వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

# ముందు జాగ్రత్త చర్యలు చేపట్టండి

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కూనవరం

గోదావరి, శబరి నదులకు వరద తాకిడి పెరిగిన నేపథ్యంలో ప్రజలు ముంపునకు గురి కాకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆవుల నాగమయ్య భవనంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల, ఎగువన కురుస్తున్న వర్షాలకు ముంపు మండలాల్లో వరద భయం వెంటాడుతుందని, గతేడాదిలా కాకుండా ప్రతి ఒక్కరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఇంటి సామాగ్రి తరలించడానికి ఖర్చులకు ప్రభుత్వం డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువులతో పాటు, గుడరాలు వేసుకోవడానికి టార్పాలిన్‌లు, కొవ్వొత్తులు అందించాలన్నారు. వరదల్లో చిక్కువారిని తరలించడానికి మర పడవలను సిద్ధం చేయాలని కోరారు. గతేడాది గోదావరి వల్ల నష్ట పోయిన ప్రజలకు సాయం అందించడంలో ప్రభుత్వం అధికారులు పూర్తిగా విఫలమైనట్లు విమర్శించారు. ఈ ఏడాది అయినా నిర్దిష్టమైన ప్రణాళికలతో ముంపు బాధితులకు న్యాయం చేయాలని, నిత్యావసర వస్తువులు అధిక ధరల అమ్మే దుకాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు ఆవుల ఉపేంద్ర, మురళి, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, కుంజా రాధ, పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు

**బిజెపి వినతి**

**చింతూరు :** గతేడాది వరదల వల్ల ముంపు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వాటిని దృష్టిలో పెట్టుకొని ముందుగానే సహాయ చర్యలు చేపట్టాలని ఐటిడిఎ కార్యాలయంలో బిజెపి నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాయం వెంకయ్య, రమణ రెడ్డి, పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌ను బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా సందర్శించారు. ఆయనకు జికె.వీధి సిఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ ఘనస్వాగతం పలికారు. ఎస్పీ సీలేరు పోలీస్ స్టేషన్, సిఆర్పిఎఫ్ ఔట్ పోస్టులు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సిఆర్పిఎఫ్ అధికారులతో సమావేశమై స్టేషను భద్రతపై ఆరా తీశారు. సీలేరు స్టేషన్ రికార్డులు పరిశీలించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలించారు. అనంతరం చింతపల్లి ఏఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, సిఐ, ఎస్ఐలతో సమావేశమయ్యారు. మావోయిస్టు కదిలికులు గంజాయి సాగు, పెండింగ్ కేసులు, సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా, సాగుపై నిరంతరం నిఘా పెట్టాలని ఆదేశించారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

## జోరుగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి-విఆర్.పురం

నిన్న మొన్నటి వరకు వేసవి తాపంతో గిరిజనం అల్లాడిపోయారు. రుతుపవనాల రాకతో సేదతీరారు. ఇప్పుడు ఏజెన్సీలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వ్యవసాయ పనులు జోరుగా చేస్తున్నారు. మెట్ట భూములు, కొండపోడు భూముల్లో గిరిజన రైతులు సాగు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతులు విత్తనాలను జల్లుతున్నారు. మండలంలోని రామవరం, వెంకన్నగూడెం ముల్కనపల్లి, పెద్దమ్మతపల్లి తదితర గ్రామాల్లో వరి నార్లు పోస్తున్నారు. మండలంలో ఏటా వరి, మిర్చి, పుగాకు ఎక్కువగా సాగు చేస్తారు. మొక్కజొన్న కూడా సాగు చేస్తారు. వీటిని సాగు చేయడానికి రైతులు మిర్చి, వరి నార్లు పోస్తున్నారు. కొండపోడు భూముల్లో మినుము, పెసర, జొన్న వంటి చిరుధాన్యాలు, కొండ ప్రాంతాల్లో కందులు, మొక్క జొన్న పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన భూముల్లో ఈ విత్తనాలను జల్లే పనుల్లో గిరిజనులు బిజీగా ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఎలు

## సమస్యలపై విఆర్‌ఎల వినతి

**ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:** ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఉపాధ్యక్షుడు పాంగి భీమరాజు ఆధ్వర్యంలో తహసిల్దార్ నరసమ్మకు విఆర్‌ఎలు వినతి పత్రన్ని అందించారు. ఈ సందర్భంగా భీమరాజు మాట్లాడుతూ, వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేసి, 60 సంవత్సరాలు పైబడిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పరీక్ష లేకుండా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విఆర్‌ఎల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని, లేకుంటే దశలవారీగా పోరాటలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు చిన్న, కార్యదర్శి పరశురామ్, లోహిదాస్, శ్యామ్, గసన్న, గోలమ్మ, సతీష్, పవన్, మోహన్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు గల్లెల జీనబందు పాల్గొన్నారు.



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ కొండలరావు

## పండ్ల మొక్కల పంపిణీ

**ప్రజాశక్తి-అనంతగిరి:** మండలంలోని వేంగడ పంచాయతీ డొంకపుట్టు, పెనంతి, మెట్టపాడు, చీడివలస, బంజోడ గ్రామాల గిరిజన రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. బుధవారం వేంగడ మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు టిఎ .చలం ఆధ్వర్యన సిల్వర్ ఓక్,. సీతాఫలం వంటి పండ్ల మొక్కలు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పంపిణీ చేశారు. రైతులు మొక్కలు నాటి సద్వినియోగం చేసుకోవాలని. కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌పిలు. క్రిష్ణ, గురుమూర్తి పాల్గొన్నారు



కార్యదర్శిని సన్మానిస్తున్న సిబ్బంది

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన నాయుడును సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు బుధవారం స్థానిక సచివాలయంలో ఘనంగా సన్మానించారు. జి.మాడుగుల పంచాయతీ కార్యదర్శిగా నాయుడు సుదీర్ఘకాలంగా పనిచేసి గిరిజనులకు అందించిన సేవలపై కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు కలిసి నాయుడును ఘనంగా సన్మానించారు.

# 'అణుకు'కు దారేది...!



- డోలి మోతల బాధ తీరేదెలా?
- గిరిజనుల పట్ల ఎడతెగని నిర్లక్ష్యం
- ఊర్లో పాఠశాలలేక అవస్థలు
- పట్టని ప్రభుత్వ యంత్రాంగం

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కోటవురట్ల విలేకరి**

జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గ పరిధి కోటవురట్ల మండలం, గొట్టువాడ పంచాయతీ అణుకు గిరిజనుల (పిటిజి) బాధలు ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజనుల బాధలను తలపిస్తున్నాయి. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామం కావడంతో ప్రభుత్వ సదుపాయాలు, సౌకర్యాలు వీరికి వర్తించడంలేదు. పెద్దపెద్ద వర్షాలొస్తే అణుకుకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతాయి. కొన్ని దశాబ్ధాల క్రితం చింతపల్లి మండలం సరమండ నుంచి కొన్ని పిటిజి కుటుంబాలు అణుకు వచ్చి, పోడు వ్యవసాయం చేసుకొని బతుకుతున్నాయి. ప్రస్తుతం 52 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అణుకు నుంచి గొట్టివాడకు రోడ్డు సౌకర్యంలేదు. గర్భిణీలు, రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాల్సివస్తే పగలైనా, ఏ అర్ధరాత్రైనా డోలికట్టి మోసుకొని కిందకు రావడం తప్ప మరోమార్గంలేదు. తమ పంటలు అమ్ముకోవాలన్నా, కుటుంబ అవసరాలకు కింది నుంచి సరుకులు తెచ్చుకోవాలన్నా అణుకు నుంచి గొట్టువాడ రోడ్డు వరకు రెండు కొండల మధ్యనున్న తేలిన రాళ్లు, పెద్దపెద్ద గతుకలు, ఎత్తుపల్లాలు, మధ్యలో నీరుపారుతున్న కల్వర్టులు, నీళ్ల చేరిన గుంతలు దాటుకొని ఐదు కిలోమీటర్లు నడుచుకొని వెళ్లిరాకతప్పదు. ఐదేళు నిండిన పిల్లలు ఇదే మార్గంలో గొట్టువాడ ప్రాథమిక పాఠశాలకు ప్రతి రోజూ పది కిలోమీటర్లు నడచుకొనివెళ్లి వస్తున్నారు. ఆరు నుంచి పది తరగతుల పిల్లలు కొందరు రెండువైపులా 20 కిలోమీటర్ల దూరంలోని కోటవురట్ల పాఠశాలకు వెళ్లివస్తున్నారు.

రోడ్డు నిర్మాణం, ఊర్లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుచేయాలని గిరిజన కుటుంబాలన్నీ ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులను ఎంతో కాలంగా కోరుతున్నాయి. వినతిపత్రాలు సమర్పిస్తూనేవున్నాయి. ఇవి ఎప్పటికీ పరిష్కారం కాకపోవడంతో అణుకు గిరిజనులు గొట్టువాడ రోడ్డు వద్ద నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నేతృత్వంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. 'ప్రజాశక్తి' అణుకు వెళ్లినప్పుడు మరికొన్ని సమస్యలు వెలుగుచూశాయి. ఎంతోకాలం క్రితం నిర్మించిన ఇళ్లు కొన్ని కూలిపోయాయి. మరికొన్ని వర్షాలకు కారిపోతున్నాయి. గాలికి వర్షపు నీరు ఇంట్లోకి రాకుండా సీందరి జంబో, వంతలి సోనా చీరలు అడ్డుపెట్టుకున్నారు. కొంతమంది ఇళ్లపైనా పెంకు ఇళ్లలు కారకుండా పరాజాలు కప్పుకున్నారు. ఇంకొందరు ఇంట్లో చేరిన నీటిని గుడ్డతో ఒత్తుకొని బయటపిండుతున్నారు. వీరంతా జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసినా ఇళ్ల స్థలం ఇవ్వలేదు, ఇళ్లు కేటాయించలేదు. అడిగితే జాబితాలో పేరుందని చెబుతున్నారు తప్ప ఇళ్లు ఇవ్వలేదని గిరిజనులు వాపోయారు.

ఊర్లోని నీళ్ల ట్యాంకు సోలార్ ప్యానల్ పాడై నెలలవుతున్నా మరమ్మతు చేయలేదు. కరెంట్ ఉన్నప్పుడు ట్యాంకు నుంచి కుళాయి నీరు వస్తోంది. కరెంట్ పోతే తాగునీరు రావడంలేదని గిరిజన మహిళలు చెబుతున్నారు. వేసవిలో స్నానాలకు కూడా ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గిరిజన కుటుంబాలకు ఇచ్చిన పట్టా భూములకు తోడు మరికొంత పోడు వ్యవసాయం చేసుకొని చోలు, కొర్రలు, వరి పండిస్తున్నారు. జీడిమామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఈ పంటలు అమ్ముకుందామన్నా, రేషన్ సరుకులు తెచ్చుకుందామన్నా ఐదు కిలోమీటర్ల దూరంలోని గొట్టివాడ మోసుకొని నడచివెళు న్నారు. పిటిజిలకు ఏ ఒక్కరికీ అంత్యోదయ అన్నయోజన కార్డు మంజూరుచేయలేదు. ప్రాథమిక వైద్యం చేసేందుకు, అవగాహన కల్పించేందుకు కనీసం ఆశా కార్యకర్తను కూడా నియమించలేదు.

ఐదు కిలోమీటర్ల దూరంలోని గొట్టువాడ నడిచివెళ్లలేరని తమ ఐదేళ్లను పిల్లలను పాఠశాలకు పంపించడంలేదు. ఐదు కిలోమీటర్లు నడిచివెళ్లలేడని తన ఐదేళ్ల అబ్బాయి జాకుబ్‌ను పాఠశాలకు పంపించడంలేదని తల్లి గమ్మెలి లింగమ్మ తెలిపింది. పాఠశాలలకు వెళ్లలేని పిల్లలు ఆరుగురు వరకు ఊర్లో ఉన్నారు. పెద్ద వర్షాలొస్తే గెడ్డనీరు ఎక్కువగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. ఆ సమయంలో అనారోగ్యంపాలైనా బయటకు తీసుకెళ్లలేక పసరమందులు వాడతామని గిరిజనులు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఊరుకు రోడ్డు, పాఠశాల ఇవ్వాలని, ఇళ్లు మంజూరుచేయాలని గిరిజన మహిళలు గమ్మెల సుందరి, గమ్మెల బంగారమ్మ కోరుతున్నారు. గిరిజన గ్రామం అణుకుకు మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజనులను ఆదుకొనే వరకు పోరాటం కొనసాగిస్తామని నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నాయకులు డేవిడ్‌రాజు తెలిపారు.

## జగదల్‌పూర్-కోరాపుట్-కొత్తవలస లైన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** జగదల్‌పూర్, జపూర్, కోరాపుట్, పాడువా, అరకు స్టేషన్లలో డిఆర్‌ఎం అనుప్ సత్పతి బుధవారం విండో ట్రెలింగ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రయాణికుల కమిటీలు, సిబ్బందితో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై డిఆర్‌ఎం చర్చించారు. జగదల్‌పూర్‌లో డిఆర్‌ఎం అనూప్ సత్పతి ద్వారా ఆఫీసర్స్ రెస్ట్ హౌస్‌లో మొక్కలు నాటారు. జైపూర్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను డిఆర్‌ఎం పరిశీలించారు. కోరాపుట్‌లో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం పాడువాలో నూతనంగా నిర్మించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయాన్ని డిఆర్‌ఎం ప్రారంభించారు. అరకులో పునరుద్ధరించిన రన్నింగ్ రూమ్‌ను ప్రారంభించారు. చివరిగా అరకులో చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:** మండలంలోని కించుమండ పంచాయతీ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సర్పంచ్ హెచ్‌బి చెల్లమ్మ కోరారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఒకటే ఫీడర్ ఉండటంతో మరమ్మతుకు గురైనప్పుడు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడుతుందన్నారు. దీంతో చిమ్మ చీకటిగా ఉంటుండటంతో పంచాయతీ గ్రామంలోని గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉదయం పూట కూడా విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో ఆన్లైన్ సెంటర్లు నడిపే నిర్వాహకులు ఆర్థికంగా నష్ట పోతున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## కీలక దశలో విఎంఆర్‌డిఎ ప్రాజెక్టులు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో :** విశాఖపట్నం మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) పరిధిలో పలు కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని వుడా జాయింట్ కమిషనర్ రవీంద్ర వెల్లడించారు. బుధవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ కాన్ఫరెన్సు హాలులో కార్యదర్శి రంగయ్య, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో పాటు నిర్వహించిన మీడియా సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. జగనన్న 1 సెంటు లే-అవుట్లు ప్రగతి పథంలో ఉన్నాయని, 4825 ఎకరాల్లో రూ.175కోట్లతో లక్షా 41వేలా 654 ప్లాట్లను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ లే-అవుట్లకు భూములిచ్చిన రైతులకు రూ.20 కోట్లతో లే-అవుట్లను నిర్మించి అందజేస్తున్నామన్నారు. ఎంఐజి లే-అవుట్‌లకు సంబంధించి భోగాపురం చోడిపల్లి వద్ద కొంత సమస్య ఉందని, రఘుమండ, పాలవలసలో పనులు క్లియర్ చేస్తున్నామని చెప్పారు. విఎంఆర్‌డిఎ కీలక ప్రాజెక్టుల్లో నగరం నడిబొడ్డున 11 ఫ్లోర్ల మల్టీలెవెల్ పార్కింగ్, కమర్షియల్ వినియోగం కోసం రూ.80కోట్లతో నిర్మిస్తున్నామని, ఈ డిసెంబరు నాటికి పనులు పూర్తికానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎకరా 35 సెంట్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంట్లో 430 కార్లు, 400 టూ వీలర్లు, 5 ఫ్లోర్లలో పార్కింగ్ చేసుకోవచ్చన్నారు.

**ఎక్కడెక్కడ ప్లాట్లు?**

జగనన్న ఎంఐజి స్మార్ట్ టౌన్‌షిప్‌లు విజయనగరంలోని నెల్లిమర్ల రఘుమండలో 287 ప్లాట్లు 22.50 సెంట్లలోనూ, గజపతినగరం మండలం జియ్యన్నవలసలో 12.31 ఎకరాల్లో 152 ప్లాట్లు, గరివిడి మండలంలోని 21.30 ఎకరాల్లో 272 ప్లాట్లు, విశాఖపట్నం జిల్లా అనందపురంలో పాలవలస 1, 2లో 76.96 ఎకరాల్లో 446 ప్లాట్లు, చోడవరం మండలంలోని అడ్డూరు వద్ద 20 ఎకరాల్లో 165 ప్లాట్లు, అనకాపల్లి మండలం అచ్యుతాపురం, భోగాపురం మండలం చోడిపల్లిలో 51.89 ఎకరాల్లో 189 ప్లాట్లు మొత్తంగా 204.96 ఎకరాల్లో 1505 ప్లాట్లు నిర్మిస్తున్నామన్నారు.

## హత్య కేసు కుట్రదారులపై చర్య తీసుకోవాలి

### లేకుంటే నాకు ఉరిశిక్ష విధించండి

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** ఆరేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో అన్యాయంగా తనను ఇరికించి ఐదేళ్లపాటు జైలుకు పంపించిన కుట్రదారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని లేదంటే తనకు ఉరిశిక్ష విధించాలని విశాఖపట్నం వన్ టౌన్ ప్రాంతానికి చెందిన పొన్నాడ శివకుమార్ కోరారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆరేళ్ల క్రితం తన తల్లి విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నివసిస్తుండగా ఎవరో హత్య చేశారని, తాను హత్య చేసినట్లు విశాఖపట్నం ప్రాంతానికి చెందిన గోడి నరసింహాచారి, పాటోజు ప్రసాదు కుట్ర చేసి హత్య కేసులో ఇరికించారని ఆరోపించారు. ఈ కేసులో తాను ఐదేళ్లపాటు సెంట్రల్ జైల్లో ఉండి విడుదలైనట్లు తెలిపారు. హత్యకు గురైన తన తల్లికి, గుడి నరసింహచారికి బంగారం విషయంలో తగాదా ఉందన్నారు. నరసింహాచారి నుంచి 100 గ్రాముల బంగారం తమకు రావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయంలో తాను, తన తల్లి కలిసి నరసింహాచారితో పలుమార్లు గొడవపడ్డామని వివరించారు. దీంతో ఆయన తమపై కక్ష పెంచుకున్నారన్నారు. తన తల్లిని హత్యలో నరసింహాచారి, ప్రసాద్ కుట్ర ఉందని ఆరోపించారు. అందుకు సంబంధించిన వీడియో, హత్య కోసం వారు పన్నిన వ్యూహం తన వద్ద ఉన్నాయని చెప్పారు. వీడియోను మీడియా సమక్షంలో వినిపించారు. ఇప్పటికైనా హత్య కేసు కుట్రదారులైన నరసింహాచారి, ప్రసాద్‌లను అరెస్ట్ చేయాలని, లేదంటే చట్టపరంగా తనకు ఉరిశిక్ష విధించినా పర్వాలేదని పేర్కొన్నారు. హత్యకు కుట్రపన్నిన నరసింహాచారి, ప్రసాద్‌పై తాను హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. వారిపై పోలీసులకు తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హిమబిందు

**ప్రజాశక్తి -సీలేరు :** ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మండలంలోని నిమ్మచెట్టు, తోటగ్రరం గ్రామాల్లో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. తొలుత వైద్యాధికారి ఆదివాసీల గృహాల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజనులు సీజనల్ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. చలితో కూడిన జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరిగిపోతుందన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవ సమయానికి ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఆసుపత్రికి దూరంగా ఉన్న గర్భిణులు ప్రసవ సమయానికి 10 రోజుల ముందు చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరి సుఖ ప్రసవం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ పోతురాజు, పీహెచ్ఎన్ రాణి, ఎంఎల్‌హెచ్ పి కళావతి, నాగమణి పాల్గొన్నారు.

## 23న ఆర్‌పి పట్నాయక్‌తో ముఖాముఖి

**ప్రజాశక్తి -సీతమ్మధార :** ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, నటుడు, నిర్మాత, చిత్ర దర్శకుడు ఆర్‌పి. పట్నాయక్‌తో ఈ నెల 23న ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు 'కరోనా తరువాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎల్‌బి కాలేజ్ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు ఈ సందర్భంగా వైజాగ్ ఫిలిం సొసైటీ నగర కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కోవిడ్ తరువాత సినీరంగంలో చోటుచేసుకున్న విభిన్న పరిణామాలపై ఆర్‌పి పట్నాయక్ మాట్లాడతారని, ప్రేక్షకుల సందేహాలను నేరుగా సమాధానమిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం ఉచితమేనని, సినీప్రియులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్, బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ అర్చన, డాక్టర్ గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

**ప్రజాశక్తి-పెందుర్తి :** సమగ్రమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయపార్టీల నేతలు సహకరించాలని ఆర్‌డిఓ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21నుంచి ఓటర్ల జాబితా పరిశీలన జరగనున్న నేపథ్యంలో సర్వే బృందానికి బూత్ స్థాయిలో సహకారం అందించాలని, తద్వారా కచ్చితమైన ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి వీలుంటుందన్నారు. జాబితాలోని ఓటర్లను నిర్ధారించడంతోపాటు తొలగింపులు, చేర్పులుమార్పులకు సూచనలు చేయాలన్నారు.ఈ సందర్భంగా నేతల సందేహాలను ఆర్‌డిఓ నివృతి చేశారు.కార్యక్రమంలో వైసిపి ప్రతినిధి నక్క కనకరాజు, టిడిపి నేత కరక దేవుడు జనసేన నాయకులు సేనాపతి శేఖర్, శ్రీకాంత్, కాంగ్రెస్ నేతలు షఫీ, రమేష్ నాయుడు సిపిఐ నాయకుడు ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు

# కొండెక్కిన కూరగాయల ధరలు

**అందనంత దూరంలో టమాటా, అల్లం, పచ్చిమిర్చి**

**వరదల నేపథ్యంలో మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజల్లో ఆందోళన**

**ప్రజాశక్తి- విఆర్.పురం :** ఏం కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు అన్నట్లుంది సామాన్యుడి పరిస్థితి. ఉల్లిపాయలు కోస్తే కళ్ల నుంచి నీళ్ళు మాత్రమే వస్తున్నాయి. కానీ కూరగాయలవైపు చూస్తేనే కళ్ళ నుంచి రక్తపు చుక్కలు వస్తున్నాయి. కొద్ది రోజులుగా కూరగాయల ధరలు ఆకాశానంటి చుక్కలు చూపిస్తున్నాయి. కూరగాయాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రధానంగా ఏ కూర వండుకోవాలన్నా టమాటా, పచ్చిమిర్చి తప్పనిసరి. వీటితో పాటు అల్లం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. టమాటా ధర చికెన్ ధరతో పోటీ పడి దాటిపోయింది. కిలో టమాటా ధర రూ.240కు పైగా ఉంది. దీంతో కూరల్లో టమాటా వేయడం మానేశారు. హోటళ్లలో టమోటా చెట్నీ కనిపించడం లేదు.

దాదాపు నెల క్రితం గిరిజన గ్రామాల్లో కిలో టమాటా ధర రూ.50, కిలో పచ్చిమిర్చి ధర రూ.40, కిలో అల్లం ధర రూ.50 ఉండగా ప్రస్తుతం వాటి ధరలు కిలో టమోటా రూ.240, కిలో పచ్చిమిర్చి రూ.180, కిలో అల్లం రూ.150 ఉంది. కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగాయి. ప్రస్తుతం శ్రావణ మాసం ప్రారంభం కావడంతో కూరగాయల ధరలు తగ్గే అవకాశం లేదు. ఈ ఏడాది అధిక శ్రావణ మాసం కావడంతో రెండు నెలల పాటు అంటే ఆగస్టు చివరి వరకు ఉంటుంది. మరో వైపు గోదావరిలో వరదనీటి ప్రవాహం పెరుగుతోంది.



మార్కెట్‌లో ఉన్న కూరగాయలు

రోడ్లు బందయ్యే అవకాశాలు ఉన్నాయి. దీనిని ఆసరా చేసుకొని కూరగాయలు, నిత్యావసరాల ధరలు మరింత పెంచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముంపు ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు, కూరగాయలు సరఫరా చేసే ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

# గాజువాక ఎంవిఆర్ కాలేజీలో యోగా కోర్సులు

**ఆంధ్రా యూనివర్సిటీతో ఎంఒయు**



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

**ప్రజాశక్తి-గాజువాక :** డిప్లమా, పిజి డిప్లమో ఇన్ యోగా కోర్సుల నిర్వహణకు గాజువాకకు చెందిన ఎంవిఆర్ డిగ్రీ కళాశాల ఆంధ్రవిశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి సమక్షంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎంవిఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎయు విసి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ యోగా కోర్సుల నిర్వహణకు ఎంవీఆర్ కళాశాల ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎంవిఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు మాట్లాడుతూ, ఆంధ్రాయూనివర్సిటీ నిర్వహించే యోగా కోర్సులను తమ కాలేజీని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే కోర్సు ప్రారంభమౌతుందని, ఎయు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తుందన్నారు.కార్యక్రమంలో ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు,యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

**ప్రజాశక్తి -మధురవాడ :** ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పిఎం పాలెం సిఐ వై రామకృష్ణ వెల్లడించిన సమాచారంతోపాటు సేకరించిన వివరాలివి. జివిఎంసి ఐదో వార్డు కొమ్మాది శివశక్తినగర్ రోడ్డు అయ్యప్ప నగర్‌లో ప్రైవేటు అపార్టుమెంట్‌లో నివాసముంటున్న ఎంవికె.ప్రసాద్ (54), అతని భార్య రాజరాజేశ్వరి (50) తమ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికంగా ఆర్ఓ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కవిటి కేంద్రంగా ఉన్న సంస్థలో వీళ్లిద్దరూ ప్రతినిధులుగా పనిచేస్తున్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ముందుగా శిక్షణ, ఆపై నియామకాలు ఉంటాయని సంస్థ తరపున ప్రచారం చేశారు. విశాఖ ప్రాంతానికి ప్రతినిధులుగా ఉన్న వీరిని నమ్మి పలువురు నిరుద్యోగులు ఒక్కొక్కరు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఆ సంస్థకు డిపాజిట్ చేశారు. రోజులు గడుస్తున్నాఉద్యోగాలు ఇవ్వకపోగా, కట్టిన డిపాజిట్లు చెల్లించలేదు. దీంతో బాధిత నిరుద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పరువు పోయిందనే మనస్థాపంతో వారు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. పిఎం పాలెం సిఐ రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

**ప్రజాశక్తి-మారేడుమిల్లి :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిచాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ సార్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని డివి కోట గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ బట్ట సోమాలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపీపీ తుంబుడు లత, డీసీహెచ్ పాలెం సర్పంచ్ కాసులమ్మ, వైసిపి మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్, నాయకులు మామిడి వినమ్, ఉలుగుల దేవిరెడ్డి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి

**ప్రజాశక్తి -ఆనందపురం:** అర్థాంతరంగా చదువు మానివేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని డిఇఒ ఎల్.చంద్రకళ కోరారు. బుధవారం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు .అనంతరం డ్రాపౌట్స్‌గా గుర్తించిన పది మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆనందపురం 24 కాలనీ ,బుడగ జంగాల కాలనీ, పొడుగుపాలెం గ్రామాలను వెళ్లి, డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం ఎన్నో విద్యా, సంక్షేమ పథకాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట వేయాలని సూచించారు. డ్రాపౌట్ విద్యార్థులకు స్కూలు యూనిఫామ్, పుస్తకాలు అందించి మరల పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించారు. బడిమానేసిన పిల్లలను తిరిగి చదువుకునేలా వారి తల్లిదండ్రులకు ఒప్పించాలని పొడుగుపాలెం ఎంపిటిసి బంటుబిల్లి అప్పలస్వామికి సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పట్నాయక్, సత్యనారాయణ, అజమ్, భాస్కరరావు, శంకరరావు మ్యాజిక్ బస్సు సిబ్బంది రమేష్ ,రమణమ్మ వెల్ఫేర్ అసిస్టెంట్ పి మనోహర్ పాల్గొన్నారు

## శంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### - రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్

**ప్రజాశక్తి-పెందుర్తి :** అంధులకు కంటిచూపుతోపాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శంకర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఆత్మకూరి యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌ను మంత్రి అమర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల కంటి ఆపరేషన్లు నిర్వహించి, అంధులకు చూపు ప్రసాదించిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సేవలు అజరామరమన్నారు. సెల్‌ఫోన్ పుణ్యమాని కంటి సమస్యలు వస్తున్నాయని, అందుకే పాఠశాలల్లో పిల్లలకు కంటిపరీక్షల నిర్వహణకు వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందులోనూ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి భాగస్వామ్యం కావడం ప్రశంసనీయమన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా శంకర ఫౌండేషన్‌కు ప్రభుత్వభూమిని కేటాయించారన్నారు. మారుతున్న కంటి ఆరోగ్య సమస్యల పరిశోధనలకు అనుగుణంగా శంకర్ ఫౌండేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డాక్టర్ రవీంధ్ర, డాక్టర్ అజయ్‌శర్మ, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డిజిఎం పిఆర్ బంగారురాజు, డిజిఎం పేషెంట్ కేర్ రమేష్‌కుమార్, ఎజిఎం వేణుగోపాల్ పాల్గొన్నారు